



# గడ్డెన్నవాగు సాగు ప్రశ్నార్థకం

నిర్మల్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. భైంసా పట్టణ శివారులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా భైంసా, లోకేశ్వరం మండలాల్లోని దాదాపు 14 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో ఈ ప్రాజెక్టు కింద ప్రధాన కాలువ నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ రూ.6 కోట్లు విడుదల చేశారు. దీంతో దాదాపు 20 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం భైంసా నుంచి పుస్పూర్, బిలోలి గ్రామాల వరకు నీరు అందుతున్నది. మరో ఎనిమిది కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకోసం గత ఏడాది కాలంగా నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. దీంతో ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు.

### • మళ్లీ పాత కాలం రోజులు అచ్చినయ్..



గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద కాలువను నమ్ముకుని వరి వేస్తే రెండెకరాలు ఎండిపోయింది. నోటికి అచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతున్నది. నీళ్లు లేక రెండెకరాలు ఇడిసిపెట్టి, పొట్ట కోసం ఒక ఎకరం పొలాన్నైనా కాపాడుకుందామని నానా తంటాలు పడుతున్న. ఎకరానికి రూ.5 వేలు కిరాయి ఇచ్చి మోటరు తెచ్చుకుని నీళ్లు పారించుకుంటున్న. రోజుకు 10 సార్లు కరెంటు బంద్ అయితున్నది. అర్ధరాత్రి ఒంటిగంటకు కరెంటు ఇస్తున్నరు. మళ్లీ పాతకాలం లెక్క రోజులు అచ్చినయ్.

-పర్స పోతన్న, రైతు, పుస్పూర్, లోకేశ్వరం మండలం



## కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడు శివారు సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్ద రైతులు కేసీఆర్ చిత్రపటానికి గురువారం జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, జై తెలంగాణ, జైజై కేసీఆర్ అంటూ రైతులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో నినదించారు. రైతులు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే తమ పంట భూములకు సీతారామ జలాలు వచ్చాయని హర్షం వ్యక్తంచేశారు.



• నాడు..

కరీంనగర్ మండలం ఇరుకుల్ల వాగుపై నగునూర్ వద్ద ఉన్న చెక్ డ్యాంలో గతంలో ఉన్న నీళ్లు



• నేడు..

ఇప్పుడు ఇదే చెక్ డ్యాంలో చుక్క నీళ్లులేని పరిస్థితి

# ఇరుకుల్ల వాగులో నీళ్లేవి?

- ఎండి పోయిన 'జీవధార'
- పరిసరాల్లో ఎండుతున్న పంటలు
- పదేండ్లలో ఎన్నడూ లేని దుర్భిక్షం
- బోర్లు, బావులు తవ్వుతున్న రైతులు

కరీంనగర్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): పదేండ్లలో జీవధారగా ఉన్న ఇరుకుల్ల వాగు ఎండిపోయింది. రాళ్లు.. రప్పలు, ఇసుక తప్ప చుక్కనీరు కనిపించడం లేదు. ఏడాదిన్నర కిందటి వరకు జీవధారగా పారిన వాగు ఒక్కసారిగా వట్టి పోయింది. వాగును నమ్ముకుని సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లు రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పంటలు ఎండిపోగా ఇంకొన్ని పంటలను రక్షించుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. బావుల అడుగులు తవ్వించుకుంటున్నారు. కొత్త బోర్లు వేయించుకుంటున్నారు. అయినా పంటలను రక్షించుకునే మార్గం కనిపించడం లేదని దిగులు పడుతున్నారు. వాగులోకి తక్షణమే నీళ్లు వదిలితేనే పంటలు చేతికి వస్తాయని వేడుకుంటున్నారు.

### ఇరుకుల్ల వాగు ఇక్కట్లు

ఏడాదిన్నర కిందటి వరకు సజీవ ధారలా కనిపించిన ఇరుకుల్ల వాగు ఎండి ఎడారిలా మారింది. రామడుగు మండలం మోతె నుంచి వచ్చే ఈ వాగును ఆ మండలంలో మోతె వాగు అని, కరీంనగర్ మండలంలో ఇరుకుల్ల వాగు అని స్థానికులు పిలుచుకుంటారు. కేసీఆర్ ప్రభుత్వంలో నారాయణపూర్ రిజర్వాయర్‌తో అనుసంధానించిన ఈ వాగులో నిత్యం నీటి ధారలు కనిపించేవి. భూగర్భజలాలు వృద్ధి చెంది ఈ వాగు పరిసర గ్రామాల రైతులకు సమృద్ధిగా సాగు నీరు ఉండేది. వాగులో తవ్వుకున్న బావులు, బోర్లలో ఏడాది పొడుగునా నీళ్లుండేవి. 24 గంటలు కరెంట్ మోటార్లు నడిచినా బావుల్లో నీళ్లు ఒడిచేవి కాదు. దీంతో ఈ వాగు పరిసరాల్లోని పలు మండలాల పరిధిలో వందల ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండేవి. సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు పంటలు పండించుకునే వారు.





కరీంనగర్ మండలం ముగ్దుంపూర్‌లో ఎండిపోతున్న వరి పంట.. గత యాసంగిలో కేసీఆర్ ముగ్దుంపూర్ వచ్చినపుడు ఇదే భూమిలో ఎండిపోయిన పంటను పరిశీలించారు. ఇపుడు కూడా ఎండి పోతున్నది

### • పరిసరాల్లో ఎండుతున్న పంటలు

**గత వానకాలంలో** వాగు ఉధృతంగా ప్రవహించేది. నగునూర్, ఇరుకుల్ల, ముగ్దుంపూర్ గ్రామాల్లో ఉన్న చెక్ డ్యాంలలో నీళ్లు ఉండేవి. బావులు, బోర్లలో భూగర్భ జలాలు ఉండేవి. ఈ పరిస్థితిని చూసిన రైతులు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి కూడా నీళ్లు వదులుతారనే నమ్మకంతో పరిసర ప్రాంతంలో వరి సాగు చేశారు. రెండు నెలల్లో పరిస్థితి తారుమారైంది. చెక్ డ్యాంలలో నీళ్లు లేకుండా పోయాయి. వేసవికి ముందే ఎండలు ప్రతాపం చూపుతుండడంతో వాగులోని బావులు కూడా క్రమంగా ఎండిపోతున్నాయి. ఇప్పటికే వాగులో తవ్వుకున్న బావులు అనేకం ఎండిపోయాయి. పరిస్థితి ఇలాగే ఉంటే మరో వారం పదిరోజుల్లో ఈ ప్రాంతంలో గతం పదేళ్లలో ఎన్నడూ చూడని దుర్భిక్షం అలుముకునే ప్రమాదం ఉంది.



# సాలూరకు నీళ్లొచ్చినయ్

నమస్తే ఎఫెక్ట్

**ఆనందంలో నిజాంసాగర్ ఆయకట్టు రైతులు.. 'నమస్తే తెలంగాణ కథనానికి స్పందన**

బోధన్ రూరల్, మార్చి 6: నీళ్లు లేక ఎండుతున్న పంటలను చూసి తట్టుకోలేక రైతులు ఆత్మహత్యకు యత్నించడంతో ప్రభుత్వం దిగివచ్చి నీటిని విడుదల చేసింది. నిజాంసాగర్ కాలువ డి 28 కింద చివరి ఆయకట్టుకు నీరు అందక నిజామాబాద్ జిల్లా సాలూర మండలంలో పొట్ట దశలో ఉన్న వరి పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర మనస్తాపం చెందిన గురునాథం అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా తోటి రైతులు అడ్డుకున్నారు. ఇదే విషయమై 'పంట ఎండే.. గుండె చెదిరే' శీర్షికన గురువారం నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీనికి ఇరిగేషన్ అధికారులు స్పందించి, నిజాంసాగర్ కెనాల్‌ను పరిశీలించారు. సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్, బోధన్ మండలం రాంపూర్ శివారులోని చివరి ఆయకట్టుకు వరకు నీళ్లు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎండుతున్న పంటలకు నీళ్లు పారుతుండటంతో రైతులు అనందం వ్యక్తంచేశారు.



## ఎండుతున్న యాసంగి పంటలు

చండ్రుగొండ, మార్చి 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామానికి చెందిన రైతు చింతల పుల్లయ్య తనకున్న రెండెకరాలలో సాగుకు రూ.70 వేలకు పైగా పెట్టుబడి పెట్టాడు. సీతాయిగూడెం వెంగళరావు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో పుల్లయ్య పొలం ఉన్నది. ప్రాజెక్టులో నీరు లేక వరిపంట పొట్ట దశకు రాకముందే ఎండిపోతున్నది. అప్పు చేసి సాగు చేసిన పొలం తన కండ్ల ముందే ఎండిపోతున్నదని పుల్లయ్య ఆవేదన వ్యక్తంచేశాడు.



## లోవోల్టేజీతో కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

నకిరేకల్, మార్చి 6 : నకిరేకల్ మండలం పాలెంలో లోవోల్టేజీతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ రాకపోవడంతో రైతులే ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకుని గురువారం నకిరేకల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి వచ్చారు. విద్యుత్తు అధికారులు ఎల్సీలు ఇవ్వడం లేదని, లైన్‌మన్ పనులు కూడా తామే చేసుకోవాల్సి వస్తున్నదని మండిపడుతున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్ చేసి ఇవ్వకపోతే 100 ఎకరాల వరి పంట ఎండిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

• జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పోతారం నాయకపు గూడెంలో నెర్రెలు బారిన పొలం



### • రైతన్న కన్నీరుమున్నీరు



'ఎకరంన్నర వరి పెట్టిన. ఎస్సారెస్పీ జలాలు వచ్చి కుంట నిండుతది.. బావిల నీళ్లు పెరుగతయని అనుకున్న. కానీ ఈ యేడూ నీళ్లు రాలె. నీరందక పంట పూర్తిగా పోయింది. గత ఏడాది ఇట్లనే నష్ట పోయిన. పాయిద లేని సేద్యం ఎందుకు చేయాలె. నాకు దిక్కెవరు. ఆదుకునేటోళ్లు ఎవరు' అంటూ రైతు భూమారెడ్డి కన్నీరుమున్నీరయ్యాడు. ఎండిన పొలాన్ని చూపెడుతూ రోదించాడు.

### • 20 గుంటలు ఎండిపోయింది..



నేను ఊరి శివారుల 20గుంటల్లో వరి పెట్టిన. కాలువల నుంచి చెరువులు, కుంటల్లోకి నీరు రాకపోవడంతో బావులు ఇంకిపోయినయి. సాగునీరందక పంట మొత్తం పోయింది. పెట్టుబడి మొత్తం పోయింది. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి.

- బద్ది లావణ్య, మహిళా రైతు, పోతారం నాయకపు గూడెం, సారంగాపూర్ మండలం.

# సారూ.. ఆగమైపోతున్నం

- కరెంట్ లేక.. నీళ్లు రాక నాలుగున్నర ఎకరాలు ఎండింది
- 300 ఫీట్లు బోరేసినా సుక్క నీరు రాలె
- దమ్మాయిపల్లిలో శ్రీనివాస్‌గౌడ్‌తో రైతు బాలయ్య ఆవేదన

పాలమూరు, మార్చి 6 : 'సారూ.. మా బతుకులు ఆగమైపోతున్నాయ్.. రుణమాఫీ కాలె.. రైతుబంధు పడలే.. కరెంట్ సక్కగా లేదు. బోర్లలో నీళ్లు లేక పంటలు చేతికి అందుతలే.. నాలుగున్నర ఎకరాల్లో వరి ఎండిపోయింది.. పంటను కాపాడుకొనేందుకు బోరు వేస్తున్నా.. 300 ఫీట్లు దాటినా చుక్క నీరు రాలే.. ' అని మహబూబ్‌నగర్ జిల్లా దమ్మాయిపల్లి రైతు బాలయ్య ఆవేదన వ్యక్తంచేశాడు. గురువారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోయిలకొండ మండలం మల్కాపూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తుండగా.. దమ్మాయిపల్లి శివారులో బోరు డ్రిల్లింగ్ చేయిస్తున్న రైతు బాలయ్యకు వద్దకు వెళ్లి పలుకరించారు. మాజీ మంత్రిని చూసిన రైతు తన గోడు వెల్లబోసుకున్నాడు. 'మీరు ఏదైనా చేయండి సార్.. అంటూ వేడుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 'మా చేతిలో ఏముంది? మీరే వినకపోతిరి.. మార్పు మార్పు అంటూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని ముందే చెప్పినం.. ఇప్పుడు అదే మాట నిజమైంది' అని అన్నారు. ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తాం.. రైతుబంధు వేస్తాం.. పింఛన్ పెంచుతాం.. ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం.. మహిళలకు నగదు ఇస్తాం.. అంటూ హామీలు గుప్పించి మోసం చేసి గెలిచాక వారి నిజస్వరూపం బట్టబయలైందని అన్నారు. మళ్లీ మోటర్లు కాలిపోతున్నాయి, కేసీఆర్ ప్రభుత్వంలో ఒక్క మోటరు కాలకుండా రైతులకు సాగునీరు అందించి, ఎకరా పొలం ఎండకుండా రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని గుర్తుచేశారు. నదుల నీటిని ఒడిసి పట్టి రిజర్వాయర్లు, చెరువులను నింపామని, అదంతా కేసీఆర్ ఘనతేనని కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడ చూసినా పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని, వేసుకున్న బోర్లకు ప్రభుత్వమే బిల్లులు ఇవ్వాలని, 24 గంటలపాటు కరెంటు ఉచితంగా అందజేయాలని, రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు.




దమ్మాయిపల్లి శివారులో బాలయ్య పొలంలో బోరు డ్రిల్లింగ్ చేస్తున్న వారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ఇప్పటికి రాలిన మట్టిపూలు 442**

### పురుగుల మందుతాగిన రైతు దంపతులు

ఆదిలాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ)/నేరడిగొండ : కాంగ్రెస్ సర్కార్ నుంచి ఎలాంటి భరోసా లేకపోవడంతో వృద్ధ రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వడూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదపు పోశెట్టి (60), ఇందిర (52) దంపతులు. ఇందిర పేరిట 3.30 ఎకరాలు, పోశెట్టి పేరిట 1.28 ఎకరాల భూమి ఉన్నది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు కాగా వారి వివాహాలు చేశారు. సాగు, ఇతర ఖర్చులు కలిపి రూ.20 లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. దిగుబడులు రాక, రూ.2 లక్షల రుణ మాఫీ వర్తించక, రైతు భరోసా అందక అప్పులు భారంగా మారాయి. ఈ క్రమంలో వారు మంగళవారం ఇంట్లోనే పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పోశెట్టి మృతి చెందాడు. ఇందిర పరిస్థితి విషమంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

### ముత్తన్నపేటలో రైతు ఆత్మహత్య

బెజ్జంకి, మార్చి 6: దిగుబడులు లేక... అప్పుల భారం మోయలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. ముత్తన్నపేటకు చెందిన గాజ రవి (45)కి వ్యవసాయం జీవనాధారం. ఇతడి కూతురు, కొడుకు హైదరాబాద్‌లో చదువుతున్నారు. వారి కాలేజీ ఫీజులతోపాటు వ్యవసాయానికి చేసిన అప్పులు భారంగా మారాయి. వాటిని తీర్చాలో తెలియక కుంగిపోయాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో కరీంనగర్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.